క్లుప్తంగా

పాఠశాలల తనిఖీ



హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న ఎంఈఓ

సిద్దవటం : మండలంలోని ఎస్.రాజంపేట, జ్యోతి, జ్యోతి గొల్లపల్లి, గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశామని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని విద్యార్థుల హాజరు రిజిస్టర్, మెనూ రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ సమయం పాటించాలన్నారు. విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద నాణ్యతా లోపం ఉంటే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని ఎంఈఓ సూచించారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా రామయ్య



ఓబులవారిపల్లె : మండల ఇన్‌చార్జ్ ఎంఈఓగా స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో గురువారం రామయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను రైల్వేకోడూరులో ఎంఈఓగా పనిచేస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం ఓబులవారిపల్లె ఇన్‌చార్జ్ ఎంఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించినట్టు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సహకరించాలని వారు కోరారు.

రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి



నిరసనలో పాల్గొన్న రైతు నాయకులు

గాలివీడు : రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీ సరిహద్దులో రైతాంగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. రైతుల పోరాటానికి సంఘీభావంగా గురువారం గాలివీడు బస్టాండులో ఏపీ రైతు సంఘం అధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మిక, రైతు కక్ష వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫారసుల ప్రకారం అన్ని పంటలకు మద్దతు ధరలు ప్రకటించి చట్టం చేయాలన్నారు. రైతుల రుణాలను మాఫీ, నాలుగు లేబర్ కోడ్లను రద్దు, కనీస వేతనం నెలకు రూ.26వేలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతులు అంజి, నాగయ్య, రాయుడు, సుబ్బరాయుడు, వెంకయ్య, మల్లన్న, రైతులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు పుణ్యకార్యం



భోజనం వడ్డిస్తున్న ఆకేపాటి మురళీరెడ్డి

రాజంపేట టౌన్ : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఉండే ముస్లింలకు ఇఫ్తార్ ఇవ్వడం మహా పుణ్యకార్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకేపాటి మురళీరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గురువారం రాత్రి మురళీరెడ్డి ఉపవాసం ఉన్న వేలాది మంది ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి స్వయంగా భోజనాన్ని వడ్డించారు. ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసే అవకాశం వస్తుండటం పూర్వజన్మ సుకృతమని మురళీరెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు ఆకేపాటి మురళీరెడ్డి ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ నాయకులు గడికోట గుల్జార్ బాషా, ఎస్.షామీర్‌బాషా, న్యామతుల్లా, జాహీద్ అలీ, అబ్దుల్ మునాఫ్, మసూద్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణలను తొలగించండి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని సింగారెడ్డిపల్లె గ్రామ సమీపంలో ఉన్న గ్రామకంట భూమిని అదే గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించి చెట్లు నాటారని సీపీఐ మండల శాఖ కార్యదర్శి గానుగపెంట ఆదినారాయణ తెలిపారు. గ్రామ కంఠం ఆక్రమణలను రెవెన్యూ అధికారులు వెంటనే తొలగించాలని వారు కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో గురువారం కబ్జాకు గురైన గ్రామ కంఠ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నెంబరు. 76లో ఐదు ఎకరాల 50 సెంట్లు గ్రామకంఠం ఉందని, సదరు భూమిలో ఓ వ్యక్తి చెట్లు నాటారని, దళితుల భూములు సరిపోక గ్రామ కంఠాన్ని ఆక్రమించుకుంటున్నారని సీపీఐ నాయకులు ఆరోపించారు. కావున రెవెన్యూ అధికారులు ఆక్రమణను తొలగించాలని వారు కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల శాఖ సహాయ కార్యదర్శి నారాయణ, కార్యవర్గ సభ్యుడు రేవూరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు అండగా సీఎం సహాయనిధి

జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి



రాజంపేట రూరల్: చెక్కులను అందుకున్న లబ్ధిదారులతో ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్ : ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు ఆర్థికంగా ఉపయోగపడుతుందని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో గురువారం రూ. 5.65లక్షలు విలువచేసే చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని ఎగువగడ్డవీధికి చెందిన షేక్ గౌస్‌బాషాకు రూ.1లక్ష, సుండుపల్లి మండలం తిమ్మసముద్రానికి చెందిన షేక్ మౌలాకు రూ.1లక్ష, పెనగలూరు మండలం సాతుపల్లెకు చెందిన చాపల ప్రసాద్‌రెడ్డికి రూ.56వేలు, పట్టణంలోని ఉస్మాన్ నగర్‌కు చెందిన హబీబుల్లాకు రూ.50వేలు, చిన్నమండెం మండలం ముత్తరాజపల్లెకు చెందిన సాన శివయ్యకు రూ.52వేలు, నందలూరు మండలం నారాయణరాజుపేటకు చెందిన వెంకటసుబ్బయ్యకు రూ.40వేలు, మండల పరిధిలోని పులపుత్తూరు పంచాయతీలోని ఏకిరిపల్లెకు చెందిన కటారు నాగయ్యకు రూ.40వేలు, నందలూరు మండలం ఇసుకపల్లెకు చెందిన కప్పల నితీష్‌కుమార్‌కు రూ.32వేలు, ఆకేపాడు పంచాయతీలోని నారంరాజుపల్లె చెందిన చమర్తి గోపాల్‌రాజుకు రూ.30వేలు, నెల్లూరు జిల్లా ఓజిలి గ్రామానికి చెందిన లహరిప్రియకు రూ.30వేలు, నందలూరు పట్టణంలోని షేక్ మహమ్మద్ సౌకత్‌కు రూ.20వేలు, వీరబల్లి మండలం మట్లీ తొగట గ్రామానికి చెందిన మండెం నాగయ్యకు రూ.15వేలు విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు డీలర్ సుబ్బరామిరెడ్డి, దాసరి పెంచలయ్య, ఇబ్బు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మశానవాటిక అభివృద్ధికి సహకరించండి

నందలూరు(రాజంపేట) : మండలంలోని నందలూరు పంచాయతీలో ఉన్న ముస్లింల స్మశాన వాటికకు, ప్రహరీ గోడ, విద్యుత్ లైన్ ఏర్పాటుకు కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిని నందలూరు మండల ముస్లిం మతపెద్దలు గురువారం కలిసి అభ్యర్థించారు. సానుకూలంగా సమస్య విన్న ఆకేపాటి తక్షణమే స్పందించి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నందలూరు ఉప సర్పంచ్ ఇబ్బు, జుల్ఫీకర్, మాహబూబ్ బాషా, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపునకు కృషి చేయాలి

ఒంటిమిట్ట : వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రాజంపేటలోని ఆకేపాటి ఎస్టేట్‌లో మండల పరిధిలోని చింతరాజుపల్లి వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజమోహన్ నాయుడు ఆధ్వర్యంలో ఆకేపాటిని పత్రపల్లి గ్రామస్తులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్‌ను వారు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. అనంతరం ఆయన వారితో మాట్లాడుతూ రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో భద్రయ్య, మధు, నాగయ్య, నడిపయ్య, చిన్న కదలయ్య, చిన్నయ్య, శ్రీరాములు, ప్రసాద్, చైతన్య, జయచంద్ర, రాజశేఖర్, కార్తీక్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆకేపాటికి సమస్యను విన్నవిస్తున్న ముస్లిం నేతలు

ఆర్బీకేలు రైతులకు గ్రంథాలయాలు



ఆర్బీకేను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, నాయకులు

రామాపురం : మండలంలోని కల్పనాయినిచెరువు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని గురువారం లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి ప్రారంభించారు. రైతులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ రైతులకు గ్రంథాలయాలుగా ఆర్బీకేలు నిలుస్తున్నాయన్నారు. ప్రతి రైతుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించడానికి ఆర్బీకేలు ఉపయోగపడుతున్నాయని అన్నారు. కియోస్క్ యంత్రం ద్వారా రైతులు తమకు అవసరమైన మందులను స్వతహాగా బుక్ చేసుకునే వీలు కల్పించామని వివరించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, ఎంపీపీ రవిశంకర్‌రెడ్డి, బాబు, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, కృష్ణయ్య, రమేష్, సచివాలయం సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించడమే లక్ష్యం



వ్యవసాయ ఉత్పత్తులను పంపిణీ చేస్తున్న సిబ్బంది

చిన్నమండెం : పౌష్టికాహారాలు నిరుపేదలకు అందించడమే లక్ష్యమని ఏపీసీఎన్ఎఫ్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణ పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో ప్రకృతి వ్యవసాయ మోడల్ మండలమైన చిన్నమండెంలోని దేవగుడిపల్లె కాలనీలో గురువారం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రైతులు పండించిన ఉత్పత్తులను వినియోగదారులకు తక్కువ ధరకు విక్రయించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధారత్న, ఎంటీఎల్ చందురెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటే కీలకం



లేబాకలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

నందలూరు(రాజంపేట) : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని ఎంపీడీఓ శేఖర్ నాయక్ అన్నారు. గురువారం నాగిరెడ్డిపల్లెలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బీఎల్‌ఓలు, పంచాయతీ సెక్రటరీలకు వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదన్నారు. ఓటును అమ్ముకోకుండా సరైన వారిని ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంఈఓ నాగయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు జయలలిత కుమారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుశీల్, వీఆర్ఓ రాజు, రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు – సీఐ మంజునాథ రెడ్డి

రానున్న ఎన్నికలలో గ్రామాలలో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని రాజంపేట రూరల్ సీఐ మంజునాథ రెడ్డి హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండల పరిధిలోని లేబాక గ్రామంలో గురువారం సీఐ మంజునాథ రెడ్డి, ఎస్ఐ అబ్దుల్ జహీర్, కేంద్ర బలగాలు, పోలీస్ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గ్రామాలలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమన్నారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పాత నేరస్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్ నాయక్, కానిస్టేబుల్ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వామపక్షాల నిరసన

రాజంపేట రూరల్ : ఏఐటీయూసీ, సీఐటీయూ, బీకేఎయుల ఆధ్వర్యంలో గురువారం జాతీయ రహదారిపై ఉన్న ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మిక, రైతు, కర్షక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వం డౌన్‌డౌన్ అని నినాదాలు చేస్తూ ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎస్ రాయుడు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సి.రవి కుమార్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఈ.సికిందర్‌లు మాట్లాడుతూ రైతులకు మద్దతు ధరల చట్టం చేయాలన్నారు. రైతుల రుణాలు మాఫీ చేయడంతోపాటు కేరళ రాష్ట్రం తరహాలో రుణ ఉపశమన చట్టం అమలు పరచాలన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం నెలకు రూ. 26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ కార్యదర్శి నరసింహులు, ఏఐటీయూసీ నాయకులు నాగేశ్వరరావు, గంగయ్య, మున్నా, రమణ, అబ్దుల్లా, రాఘవ గిరీష్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పరవాయి సుబ్రమణ్యం, టైల్స్ యూనియన్ నాయకులు జమాల్ మున్నా, హమాలి యూనియన్ నాయకులు రవి, సుంకన్న, లింగన్న, అంజన్న, గుంట రమణ, నాని, సుబ్రమణ్యం, రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడి



రైతుకు సూచనలు ఇస్తున్న అధికారులు

లక్కిరెడ్డిపల్లె : వేరుశనగలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు పొందవచ్చని ఆత్మా పీడీ విజయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం దిన్నెపాడు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వేరుశనగలో మొక్కల సాంద్రత చదరపు మీటరుకు 44 మొక్కలు ఉండాలని, దీని ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. పంట చుట్టూ ప్రత్యామ్నాయ పంటలైన సజ్జ, జొన్న, కంది వంటి పంటలను అంతర పంటలుగా పొలం చుట్టూ వేయాలన్నారు. ఇవి పంటకు రక్షణగా ఉంటాయన్నారు. కేవీకే శాస్త్రవేత్త వీరయ్య మాట్లాడుతూ విత్తన శుద్ధిలో ఇమిడ క్లోప్రైడ్ రెండు మిల్లీ గ్రాములు ఒక కిలో విత్తనాలకు కలిపి నీటిలో ఆరపెట్టాలని తరువాత విత్తితే ఎలాంటి వేరుశనగ పురుగు ఆశించదన్నారు. ఎరువులు యాజమాన్యంతో ఎనిమిది కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం, 20 కిలోల పొటాషియం ఎకరాకు ఉపయోగించాలన్నారు. దీంతో పంట ఎక్కువగా పెరిగి విత్తనంలో నూనెశాతం పెరుగుతుందన్నారు. ప్రతి రైతు పొలంబడి ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో డీపీఓ పద్మలత, డీఆర్సీ ఏఓ సుమిత్ర, బీటీఎం రమేష్, పవన్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల విశిష్టతను తెలుసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : చిరుధాన్యాలు, తల్లిపాల విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని ఏసీడీపీఓ సరళాదేవి గురువారం తెలిపారు. మండలంలోని శెట్టిగుంట సెక్టార్ ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు చిరుధాన్యాలు, తల్లిపాల విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల పెరుగుదలలో చిరుధాన్యాలు, తల్లిపాలకు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గుణవతి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : నగరంలో బ్యాంకు ఉద్యోగాల కోసం శనివారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏదైనా డిగ్రీ, పీజీ కలిగి 18–30 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు తీసుకుని ఈ జాబ్‌మేళాలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

బాసటగా నిలిచాం.. అండగా నిలవండి



ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రామాపురం : మండలంలోని చిట్లూరు పంచాయతీలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం జరిగిన ప్రచారంలో వారు పక్కీరపల్లె, పాలన్నగారిపల్లెల్లోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేసిన సంక్షేమాన్ని వివరించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చామన్నారు. గ్రామాల్లో సచివాలయాలు ఏర్పాటు చేసి మండల కేంద్రానికి వెళ్లే అవసరం లేకుండా ప్రభుత్వ సేవలను సచివాలయాల్లోనే అందిస్తున్నామన్నారు. మండలానికి వెలిగల్లు నీటిని అందిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. ఆర్బీకేల ద్వారా రైతులకు అవసరమైన సలహాలు – సూచనలు రైతులకు అందిస్తూ వారికి బాసటగా ఉన్నట్టు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా శ్రీకాంత్‌రెడ్డిని, ఎంపీగా మిథున్‌రెడ్డిలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించుకొని, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి చేసుకుందామని తెలియజేశారు. ప్రచారంలో సర్పంచ్ రామాంజులు, మురళీమోహన్‌రెడ్డి, ఆదిరెడ్డి, హరినాథరెడ్డి, రమేష్, రసూల్‌ఖాన్, శంకర్‌రెడ్డి, అమర్‌నాథరెడ్డి, శ్రీనివాసులు, మైనార్టీ నాయకులు ఖాదర్‌ఖాన్, అంజద్‌ఖాన్, హమ్మద్‌ఖాన్, ఇనాయతుల్లా, అతావుల్లాఖాన్, బసిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కమిటీల నియామకం

ఓబులవారిపల్లె: రైల్వేకోడూరు నియోజకవర్గానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం కమిటీలను నియమిస్తూ గురువారం ప్రకటన విడుదల చేసింది. అన్నమయ్య జిల్లా మహిళా విభాగం కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఎస్.మల్లేశ్వరి, కార్యదర్శులుగా కె.అరుణ, పి.పుష్పలత, జాయింట్ సెక్రటరీలుగా జి.గిరిజ, సీహెచ్ విజయలక్ష్మిలను నియమించారు. అలానే అన్నమయ్య జిల్లా ఎస్సీ సెల్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఇసుకపాటి నారాయణమ్మ, జనరల్ సెక్రటరీగా డి.సిద్దయ్య, సెక్రటరీలుగా డివి రమణ, దమ్ము రఘు, జాయింట్ సెక్రటరీలుగా ఎస్.వెంకటయ్య, జి.వెంకటేష్, జి.రాజేశ్వరిలను నియమించారు.

మహిళా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



చెక్కును అందజేస్తున్న సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : మహిళా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో చేయూత డిజిటల్ చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాయికిషోర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల ఆర్థిక ఎదుగుదలతోనే కుటుంబాల అభివృద్ధి చెందుతాయన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు మహిళలు పేరుపైనే అందించడం జరుగుతోందన్నారు. అంతేకాకుండా మహిళలకు దేశంలో ఎక్కడా లేని విధంగా యాభై శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. చేయూత పథకం ద్వారా మండలంలోని మహిళలకు రూ.3.60 కోట్లను మహిళల ఖాతాల్లో జమ చేయనున్నట్టు పేర్కొన్నారు. మహిళలు సీఎం జగన్ పక్షానే ఉన్నారని, రాబోయే ఎన్నికలలో జగనన్నను మరలా అందరం ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం డిజిటల్ చెక్కులను మహిళా సంఘాలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయారావు, ఏరియా కో–ఆర్డినేటర్ నిరంజన్, ఏపీఎం ఆర్ముగం, ఎంపీటీసీలు సుజాత, దుర్గా ప్రసాద్, సర్పంచ్ ఈశ్వరయ్య, వెలుగు సీసీ దామోదర్, వైఎస్సార్‌సీపీ నాయకులు గడ్డం వెంకటేష్, మారే సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపాలన్నదే లక్ష్యం

కోడూరులో రాజన్న క్యాంటిన్ ప్రారంభం



రాజన్న క్యాంటిన్‌లో భోజనం వడ్డిస్తున్న ఏపీఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి తదితరులు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద గురువారం ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ సాయికిషోర్‌రెడ్డిలు రాజన్న క్యాంటిన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభిమానులు, కార్యకర్తలు, పేదలకు ఆకలి తీర్చడానికి రాజన్న క్యాంటిన్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిరంతరం పేద ప్రజల కోసమే ఆలోచిస్తూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఎంతమంది వచ్చినా అందరికీ మూడు పూటల నాణ్యతతో కూడిన భోజనాన్ని అందజేస్తామని వారు తెలియజేశారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా పేదల కడుపు నింపాలనే సదుద్దేశంతో ప్రారంభించిన క్యాంటిన్‌ను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట శివసాయి, సుధాకర్‌రాజు, రౌఫ్, రమణారెడ్డి, కన్నా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ స్కూల్ ఓ వరం

లక్కిరెడ్డిపల్లె : మారుమూల ప్రాంతాల విద్యార్థులకు ఏపీ మోడల్ స్కూల్ వరం లాంటిదని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని రవీంద్రనగర్, చాగలగుట్టపల్లి, వడ్డిపల్లి, కుర్నూతల, దియ్యలవాండ్లపల్లి, వంకగడ్డమాలపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులను ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేర్పించాలని ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్ పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అలానే అటల్ టింకరింగ్ ల్యాబ్, ఒకేషనల్ కోర్సు, డిజిటల్ తరగతులు ఎన్నో వసతులు ప్రభుత్వం కల్పిస్తోందని, ప్రతి విద్యార్థి మోడల్ స్కూల్‌లో ప్రవేశం కోసం నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగయ్య, నిత్య పూజయ్య, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు రెడ్డయ్య, శ్రీదేవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించండి

మండల సర్వసభ్య సమావేశంలో అధికారులకు ఎంపీపీ సూచన



మాట్లాడుతున్న ఎల్‌వీ మోహన్ రెడ్డి

చిట్వేలి : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని ఎంపీపీ టంగుటూరి చంద్ర అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఎంపీపీ సభా భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకట రంగారావు మాట్లాడుతూ అధికారులు ఆయాశాఖల వారీగా చేసిన, చేస్తున్న అభివృద్ధిని సభకు వివరించారు. అనంతరం సీనియర్ నాయకులు ఎల్‌వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ సమస్యలపై కార్యాలయాలకు వచ్చే రైతుల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంపీటీసీలు, సర్పంచ్‌లు వారివారి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభలో ప్రస్తావించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు ఎంపీపీ తెలియజేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'రాష్ట్రం నుంచి టీడీపీని తరిమికొడతాం'

రాయచోటి టౌన్ : వడ్డెర్ల ఆశలపై నీళ్లు చల్లిన టీడీపీ అధినేత చంద్రబాబును, ఆయన పార్టీని రాష్ట్రం నుంచి తరిమికొడతామని రాష్ట్ర వడ్డెర యువజన సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఈ.నాగేశ్వరరావు వడ్డెర్లకు పిలుపునిచ్చారు. టీడీపీ వడ్డెర్లకు రాజకీయాల్లో చేస్తున్న అన్యాయంపై గురువారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షలకు పైగా వడ్డెర్లు ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. రాయలసీమలోని సుమారు 20 నియోజకవర్గాలకు పైగా వడ్డెరలే వివిధ పార్టీల జయాపజయాలను శాసించేస్థాయిలో ఉన్నారన్నారు. అలాంటిది వడ్డెర్లను రాజకీయంగా ఒక్క స్థానం కూడా కేటాయించకుండా ఇంత మంది ఓటర్లు ఉన్నప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా కనీసం ఒక అసెంబ్లీ స్థానాన్ని కూడా కేటాయించకపోవడం విచారకరమన్నారు. అన్ని రంగాల్లో అడుగునా ఉన్న వడ్డెర్లకు రాజకీయంగా స్థానం లభిస్తే వారి ఎదుగుదలకు అవకాశం ఇచ్చినట్టు ఉంటుందన్నారు. అలాంటిది వడ్డెర్లకు ఒక్క స్థానం కేటాయించని ప్రతిపక్ష నేత చంద్రబాబుకు బుద్ధి చెబుతామని తెలియజేశారు.